ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలి

- రైతుల పక్షాన పోరాటం చేస్తా
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- మండల కేంద్రాల్లో ధర్నా


ఇబ్రహీంపట్నం: ధర్నాలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పాలకులు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణామాఫీని రైతులందరికీ వర్తింపజేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రుణామాఫీ కాని రైతులకు మద్దతుగా ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా రైతులందరికీ రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. బస్సులల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని కాంగ్రెస్ పాలకులు నెరవేర్చాలేదన్నారు. అబద్దాలతోనే కాంగ్రెస్ పాలన సాగుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ కృపేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నిట్టు జగదీశ్, రైతులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఎలాంటి ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జీఎల్ఎన్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కంబాల పరమేశ్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేశామని గొప్పగా చెప్పుకుంటున్నా సగంమంది రైతులకు కూడా మాఫీ చేయలేదన్నారు. కడ్తాల మండల కేంద్రంలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అంతకుముందు ధర్నాలో జీఎల్ఎన్ రెడ్డి, కంబాల పరమేశ్‌లు మాట్లాడుతూ రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మండల రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ జోగు వీరయ్య, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, బొప్పిడి గోపాల్, చంద్రమౌలి, రమేశ్, మాజీ సర్పంచ్‌లు సాయిలు, హరిచంద్‌నాయక్, దేవానాయక్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోపేర్కొన్న విధంగా రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షుడు శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ముజీబర్ రహ్మాన్, మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, లలితమ్మ, జ్యోతయ్య, ఈశ్వర్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, యాదయ్య, నరోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లి: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, తదితరులు


కడ్తాల్: డీటీ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

క్లుప్తంగా

రుణమాఫీపై మాట్లాడే హక్కు లేదు

మాజీ ఎంపీటీసీ కొత్త పాండు గౌడ్


మాట్లాడుతున్న పాండు గౌడ్

మాడ్గుల: రైతు రుణమాఫీపై బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కు లేదని మాజీ ఎంపీటీసీ కొత్త పాండు గౌడ్ పేర్కొన్నారు. గురువారం మాడ్గుల మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేండ్ల పాలనలో రుణమాఫీ పేరిట రైతాంగాన్ని మోసం చేసింది బీఆర్‌ఎస్సేనని మండిపడ్డారు. నాలుగు విడతలుగా రైతుల ఖాతాలకు చెల్లించిన నిధులు బ్యాంకు వడ్డీలకే సరిపోయిందన్నారు. ఏక కాలంలో కాంగ్రెస్ రూ. 2లక్షల రుణమాఫీ చేసి రైతుల పక్షాన నిలిచిందన్నారు. ఈ సమావేశంలో దర్శన్, రాజు, వెంకటయ్య, జంగయ్య, శివ, యాదగిరి, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసనకు తరలిన నాయకులు


ఈడీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: అదానీ కంపెనీలలో సెబీ చైర్మన్ భర్త పెట్టుబడులపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తూ పీసీసీ ఆధ్వర్యంలో గురువారం ఈడీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ నిరసనకు పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహా, మాడ్గుల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, మిట్టపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయిల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా ఉన్నప్పటి నుంచి నేటి వరకూ అదానీ, అంబానీలతో ఉన్న మిత్రుత్వంతో దేశంలోని ప్రధాన సంస్థలను వారిరువురికీ కట్టబెడుతున్నారని ఆరోపించారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తాం

ఎంపీడీఓ బాలశంకర్


మాట్లాడుతున్న బాలశంకర్ తదితరులు

మంచాల: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మంచాల ఎంపీడీఓ బాలశంకర్ పేర్కొన్నారు. గురువారం మంచాల మండల కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కెటాయించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ మల్లారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ఘనంగా ఓరియంటేషన్


ఓరియంటేషన్‌లో పాల్గొన్న ప్రముఖులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలో గుంతపల్లి గ్రామంలోని అవంతి విద్యాసంస్థల ఆవరణలో గురువారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్‌ను ఘనంగా నిర్వహించారు. అవంతి విద్యాసంస్థల అధినేత ముత్తెంశెట్టి శ్రీనివాస్‌రావు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ బి విష్ణు వర్ధన్, క్వాలిటీ పొటానిక్స్ లెడ్‌చిప్ ఇండస్ట్రీస్ సీఈవో డాక్టర్ కేవీకే గుప్తా, శ్రీ రామకృష్ణ మఠం అధ్యాపకులు శ్రీమహారాజ్ స్వామి, అవంతి విద్యాసంస్థల ఎండీ శ్రావణ్‌కుమార్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యాపకులు బోధించే విషయాలను శ్రద్ధగా చదువుకోవాలని, తల్లిదండ్రులు గర్వించే స్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన వార్షికోత్సవాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో 41వ వార్షికోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు అమ్మవారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అనంతరం భక్తులకుతీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది మీగడ కాశీనాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు వర్తింపచేయండి

- కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్
- తహసీల్దార్‌కు వినతి

హుడాకాంప్లెక్స్: దళితబంధు పథకం కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి వర్తింపచేయాలని కోరుతూ సరూర్‌నగర్ మండల తహసీల్దార్‌కు గురువారం దళితబంధు కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ సరూర్‌నగర్ డివిజన్‌లో దళితబంధుకోసం సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించామని, చివరి క్షణంలో ఎన్నికల కోడ్ కారణంగా లబ్ధిదారులకు మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మాదాసు వెంకటేశ్, కోశాధికారి బోయ శివకుమార్, సంయుక్త కార్యదర్శులు మొగిళ్ల మల్లేశ్, కందుల రాము, సభ్యులు గోపాల్, మాదురి, బేర శృతి, ప్రసాద్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి

మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ


మరమ్మతులు చేయిస్తున్న మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ తదితరులు

మంచాల: బండలేమూర్–పోర్ల గడ్డ తండా రోడ్డుకు మరమ్మతులు చేయించాలని మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం బండలేమూర్–పోర్ల గడ్డ తండా రోడ్డుపై వర్షాలకు ఏర్పడిన గోతులను జేసీబీ సహాయంతో మట్టి పోసి పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి–రంగారెడ్డి జిల్లా సరిహద్దు గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ రోడ్డు పాడై పోవడంతో ఆర్టీసీ బస్సు కూడా రావడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డును బాగు చేయాలని అనేక సార్లు ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరారన్నారు. ఐనప్పటికీ ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే మరమ్మతు పనులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు వట్టి వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు దర్శన్, స్థానిక నాయకులు వెంకటయ్య, రంగయ్య, జంగయ్య, కిషన్, లింగం, పరమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలోని సురసముద్రం చెరువు కట్టపై పునర్నిర్మించిన కట్టమైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండోరోజు గురువారం మహాగాయత్రిదేవి ఉపాసకురాలు నారాయణి ప్రత్యంగిరా మాతాజీ ఆధ్వర్యంలో విగ్రహానికి అభిషేకం, దివ్యశాంతి, మహాయజ్ఞం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్, అలయ కమిటీ చైర్మెన్ మక్తాల వెంకటయ్య, మాజీ ఎంపీపీ తల్లోజు వెంకటయ్య, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ముదిరాజ్‌సంఘం నాయకులు మక్తాల అంజయ్య, వెంకటయ్య, ఎర్రవోలు రాజు, కే శ్రీను, ఎర్రవోలు మహేశ్, బొల్లు శివ, వెంకటయ్య, మల్లేశ్, చిన్న వెంకటయ్య, రమేశ్, మహేశ్, శ్రీశైలం, నరేశ్, ఊరటి వెంకటయ్య, మక్తాల సాయి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తలకొండపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మెదక్‌పల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి, సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 155 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్ వంటి వాటికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కలుషిత నీటి నివారణకు క్లోరినేషన్ చేసి లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అపరిశుభ్రంగా ఉండే ఆహారాన్ని తీసుకోవద్దని, వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నరేష్, దర్వ్యాల శంకర్, అశోక్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, రజనీకాంత్, అశోక్, మనోహర్, రాములు, శ్రీశైలం, నవీన్, పాండు, దయాకర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లిలో గురువారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. దీనికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పురపాలక శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.


బోనంతో మహిళలు

పర్యావరణ పరిరక్షణకు కృషి



ఇబ్రహీంపట్నం: గోడపత్రికను ఆవిష్కరణ చేస్తున్న ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు


మొక్క నాటుతున్న ఎంపీడీఓ వెంకటమ్మ

ఇబ్రహీంపట్నం: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక పేర్కొన్నారు. జాతీయ సేవా విభాగం, జాతీయ విద్యా విషయక విభాగాల ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన నిర్వహించి, గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రతతోనే వ్యాధులు దరి చేరవన్నారు. రానున్న వినాయక చవితికి మట్టితో తయారు చేసిన ప్రతిమలను పెట్టి పూజించాలని కోరారు. పర్యావరణం బాగుంటేనే మనుషుల మనుగడ సాఫీగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సురేష్, జాతీయ సేవా విభాగం అధికారులు ఎస్ రమేష్, చింతల రాకేష్, భవానీ, రచన పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములవుదాం

పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వెంకటమ్మ కోరారు. నాటుదాం ఒక చెట్టు–అమ్మ పేరు మీద అనే కార్యక్రమాన్ని గురువారం ముకునూర్ గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచి కాలుష్యాన్ని నివారించాలంటే చెట్లతోనే సాధ్యమన్నారు. ముకునూర్ నుంచి రాయపోల్ రోడ్డు వరకూ 400 గుంతలు తీసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ లింగం, టీఏ ఇందిర, ఉపాధి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


తలకొండపల్లి: హర్య నాయక్ తండాలో మొక్క నాటుతున్న ఏంపీడీఓ శ్రీకాంత్ తదితరులు

మొక్కలతో మానవ మనుగడ

తలకొండపల్లి: మొక్కలతోనే మానవ మనుగడ ఉంటుందని ఎంపీడీఓ శ్రీకాంత్ పేర్కొన్నారు. పచ్చని చెట్లు–ప్రగతికి మెట్లని, చెట్లుంటే క్షేమం, లేకుంటే క్షామం అని పేర్కొన్నారు. మేరి లైఫ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా 'నాటుదాం–ఒక్క చెట్టు అమ్మ పేరు మీద' అనే కార్యక్రమాన్ని గురువారం హర్య నాయక్ తండాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్త ప్రాణ కోటికి చెట్లే ప్రాణాధారమని తెలిపారు. మొక్కల పెంపకంతో అడవులు పెరిగి సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కృష్ణ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

'మీ సేవ' కష్టాలు

- మండలంలో ఒకే కేంద్రం.. మూడున్నరేళ్ల క్రితం ఒకటి సీజ్
- నాలుగేళ్ల క్రితం నిర్వాహకుడు మరణించడంతో మరొకటి మూత
- ప్రజలకు తప్పని తిప్పలు



రెడ్డిపల్లి మీ సేవ కేంద్రం

మొయినాబాద్: అన్ని రకాల ఆన్‌లైన్ సేవల కోసం ప్రతి 5వేల జనాభాకు ఒక మీ సేవ కేంద్రం ఉండాలి. కానీ మండలంలో 70 వేల జనాభాకు ఒకే మీ సేవ కేంద్రం ఉంది. సుమారు మూడున్నర సంవత్సరాలుగా ఈ పరిస్థితి ఉన్నా కొత్త మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

తప్పని ఇబ్బందులు

మొయినాబాద్ మండల ప్రజలు సుమారు మూడున్నర సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం మాత్రం సమస్య తీర్చడంపై దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలం మొత్తానికి ఒకే మీ సేవ కేంద్రం కొనసాగుతుండడంతో ప్రజల కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న మండలంలో ప్రభుత్వం గతంలో మూడు మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో రెండు మీ సేవ కేంద్రాలు మూడున్నర సంవత్సరాల క్రితమే మూతపడ్డాయి. నాలుగు సంవత్సరాల క్రితం హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రం నిర్వాహకుడు మరణించడంతో అది మూతపడింది. అదేవిధంగా మూడున్నరేళ్ల క్రితం మొయినాబాద్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేశారు. దీంతో రెడ్డిపల్లిలో ఉన్న మీసేవ కేంద్రం ఒక్కటే మండల ప్రజలకు దిక్కయ్యింది. మండలంలో మరో మీసేవ కేంద్రం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రెడ్డిపల్లి మీసేవ కేంద్రానికే వెళ్లాల్సి వస్తోంది.

నోటిఫికేషన్ ఇచ్చినా..

నాలుగేళ్ల క్రితం నిర్వాహకుడి మరణంతో మూతపడ్డ హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చింది. మీసేవ నిర్వాహణకు దరఖాస్తు చేసుకోవాలని కోరడంతో మండలంలోని చాలా మంది దరఖాస్తు చేసుకుని పరీక్ష సైతం రాశారు. కానీ మీసేవ కేంద్రాన్ని స్థానికులకు కాకుండా స్థానికేతరులకు కేటాయించారని దరఖాస్తు చేసుకుని పరీక్షరాసిన కొంత మంది తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. మరోసారి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు ఇవ్వడం లేదు. మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సీజ్ చేయడంతో నిర్వాహకుడు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చాడు. దీంతో మొయినాబాద్‌లో మీసేవ కేంద్రం నిర్వహించేందుకు స్టే అడ్డంకిగా మారింది.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మండలంలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రతీది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో అందరూ మీ సేవ కేంద్రాలకే వెళ్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, పుట్టినతేదీ సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి తోడు రెవెన్యూకు సంబంధించిన చాలా దరఖాస్తులను మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. దీంతో విద్యార్థులు, రైతులు చాలా మంది రెడ్డిపల్లి మీసేవ కేంద్రం వద్దకే వెళ్లాల్సి వస్తోంది. ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో దరఖాస్తుల కోసం వచ్చిన వారందరూ ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుండడంతో అసహనానికి గురవుతున్నా రు. కొంతమంది ఇతర మండలాల్లోని మీసేవ కేంద్రాలకు వెళ్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



మండలంలో ఒకే మీ సేవ కేంద్రం ఉండటంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లిలో మీసేవ కేంద్రం ఉండటంతో చాలా గ్రామాల ప్రజలు అంత దూరం వెళ్లడం ఇబ్బందిగా మారింది. మండలంలో కొత్త మీసేవ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.
– సంతోష్, సురంగల్, మొయినాబాద్ మండలం